క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: చీరాల రూరల్ మండలం తోటవారిపాలెంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరామర్శించారు. ప్రమాదంలో ఆట్ల పోతురాజు కుమార్తె శ్రీనివాసులు, ఆయన తల్లి ఆట్ల కోటమ్మ ఇరువురు మృతిచెందారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నాదెండ్ల కోటేశ్వరరావు, కట్టా గంగయ్య, దంతం హనుమంతు, ప్రతాప్, సుకీర్తన తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా కులగణన సర్వే



సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు మండలంలో కులగణన సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆర్ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలో మొత్తం 254 క్లస్టర్లుండగా వాటిలో ఇప్పటి వరకు సుమారు 200 క్లస్టర్లు సర్వే పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. కులగణన సర్వేలో వలంటీర్లు చురుకుగా పాల్గొంటున్నట్లు, సర్వేకు సంబంధించి పర్యవేక్షణను చేస్తున్నట్లు ఆమె వివరించారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, పుష్యమాసం, రోహిణి నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


అద్దంకి సీఐ బాధ్యతల స్వీకరణ



కృష్ణయ్య, సీఐ

అద్దంకి రూరల్: అద్దంకి నూతన సీఐగా పీ. కృష్ణయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. నరసరావుపేట రూరల్ నుంచి బదిలీపై అద్దంకికి వచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అద్దంకిలో ట్రాఫిక్, తోపాటు శాంతి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో బైకు దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న బైకు

అద్దంకి రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో బైకు దగ్ధమైన ఘటన అద్దంకిలోని భవానీ సెంటర్‌లో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు తమ్మవరం గ్రామానికి చెందిన ఎన్ వెంకటరావు ఇటీవలే కొనుగోలు చేసిన బైకును సర్వీస్ చేయించుకుని స్థానిక భవానిసెంటర్‌లో నిలిపి పానిపూరి తినేందుకు వెళ్లాడు. ఇంతలో హఠాత్తుగా బైకు నుంచి మంటలు రావడంతో బైకు అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

మాలకొండ ఆదాయం రూ.9,12,817

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.9,12,817 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.28,160, తలనీలాలు రూ.44,400, ప్రత్యేక దర్శనం రూ.2,99,300, లడ్డుప్రసాదాలురూ.2,06,775, అన్నదానం రూ.2,40.040, రూము అద్దెలు రూ.33,460 వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడా స్ఫూర్తి



కారంచేడులో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓలు



క్రికెట్ విజేతలను అభినందిస్తున్న బల్లికురవ ఎంపీడీవో, అధికారులు

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ,యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రవేశపెట్టిందని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అన్నారు. మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. యువకుల విభాగంలో క్రికెట్‌లో బల్లికురవలో బాడ్మింటన్ వైదన ఖోఖోలో, కొప్పరపాడు కబడ్డీలో ఉప్పుమాగులూరు–1, వాలీబాల్‌లో కొణిదెన, యువతుల విభాగంగా క్రికెట్‌లో ఉప్పుమాగులూరు–2, బాడ్మింటన్‌లో ఉప్పుమాగులూరు–2, వాలీబాల్ కబడ్డీ, ఖోఖోలో గుంటుపల్లి జట్టు విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. వీరందరిని త్వరలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీలకు పంపుతామని ఎంపీడీవో వివరించారు. పోటీలను ఈవోఆర్డీ సుమతీ, సెక్రటరీలు, పాఠశాలల పీడీలు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

క్రికెట్‌లో కుంకలమర్రు జట్టు ప్రతిభ..

కారంచేడు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో మండల స్థాయిలో కుంకలమర్రు గ్రామానికి చెందిన టీం విజయం సాధించిందని ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రం కారంచేడు డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆరు టీంలు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో ఫైనల్‌కు చేరిన కారంచేడు, కుంకలమర్రు టీంలను ఫైనల్ ఆడించగా కారంచేడుపై కుంకలమర్రు టీం విజయం సాధించింది. దీంతో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వార ఉచితంగా క్రికెట్ టీంకు అవసరమైన క్రీడా సామగ్రిని ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, పీడీలు పీ శ్రీనివాసరావు, కే ప్రసాదు, సుబ్బారావు, రమాదేవి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



బల్లికురవలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

పంచాయతీల అభివృద్ధిపై అవగాహన



బల్లికురవలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో



పర్చూరులో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

ఇంకొల్లు (చినగంజాం): పంచాయతీలలో జరిగే అభివృద్ధి ప్రణాళికలపై ప్రజా ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని ఈఓఆర్డీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఇంకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం వంటి పనులకు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కల్పించడం. పంచాయతీలకు ఆదాయ వనరులు, పంచాయతీలకు నిధులు అందించే ప్రభుత్వ సంస్థలు, నిధులు వాటి వినియోగం, వాటి ఖర్చులు పెట్టే విధానం, ప్రణాళికలు తయారీ తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లుగా పంచాయతీ కార్యదర్శి శశి, వ్యవసాయాధికారి, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రాధాన్యత పనులకు అంచనాలు తయారు చేయాలి..

బల్లికురవ: గ్రామ పంచాయితీల అభివృద్ధికి అందరి సహకారంతో ప్రాధాన్యత పనులను గుర్తించేందుకే శిక్షణ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అన్నారు. గురువారం స్థానిక పరిషత్ కార్యాలయంలో రెండు బ్యాచ్‌లుగా ప్రారంభమైన శిక్షణ శనివారం సాయంత్రంతో ముగిసింది. 2024–25 సంవత్సరానికి ఈ–గ్రామ స్వరాజ్‌లో అభివృద్ధి పనులను గుర్తించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గుర్తించిన పనులకు మాత్రమే నిధులు మంజూరు అవుతాయని, ఆ పనులే పూర్తిచేయాలని ఎంపీడీవో వివరించారు. శిక్షణలో ఈవోఆర్డీ సుమతి, కార్యాలయ ఏవో రాంబాబు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎఫర్ట్ కార్యాలయం ఆవరణలో 3150 రోటరీ జిల్లా గవర్నర్ బి. శంకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 9 మంది రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్య ఆరోగ్య సిబ్బంది షారుఖ్, జోసెఫ్‌లు దాతల నుంచి రక్త సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శి తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, మోహనరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్సై ఖాదర్ బాషా

టంగుటూరు: మండలంలోని జయవరం గ్రామంలో కొప్పోలు సంతోష్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా పలు రకాల 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 16 సీజ్ చేశామని ఎస్సై ఖాదర్‌బాషా శనివారం తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

అంబేడ్కర్ సామాజిక భవనానికి ఆర్థిక సాయం



భవన నిర్మాణ పనులు చేయిస్తున్న రాధాకృష్ణమూర్తి

అద్దంకి రూరల్: అద్దంకిలోని అంబేడ్కర్ సామాజిక భవన అభివృద్ధి పనులకు అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి రూ. 10 లక్షల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు ఇటీవల ప్రకటించారు. పనుల్లో భాగంగా శనివారం భవనంలో వాటర్ బోరు వేయించి కరెంటు ఏర్పాటుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఈఈ మస్తాన్‌రావును కోరారు. కార్యక్రమంలో కిరణ్, పూర్ణ, సురేంద్ర, నాగయ్య, గంగాధర్, బన్ను, వీరాంజనేయులు ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

‘రోషాగ్ని’ సినిమా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చిత్ర హీరో రాజావీరరాజు

అద్దంకి రూరల్: అద్దంకిలోని కళామందిర్ థియేటర్‌లో ఆదివారం ప్రదర్శించబడుతున్న ‘రోషాగ్ని’ చిత్రాన్ని విజయవంతం చేయాలని చిత్ర దర్శకుడు, నిర్మాత, హీరో, ఫైట్ మాస్టర్ సూర్యవంశపు రాజావీరరాజు శనివారం అద్దంకి ప్రేక్షకులను కోరారు. స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లా లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హీరో రాజావీరరాజు మాట్లాడుతూ తాను అద్దంకి మండలం కొటికలపూడి గ్రామానికి చెందినవాడినని, కరాటే నేర్చుకున్న తనను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రోత్సాహించటంతో కన్నడ సినీ రంగంలో ప్రవేశించి 17 చిత్రాల్లో పెద్ద హీరోలతో కలిసి వివిధ పాత్రల్లో నటించానన్నారు. తానే హీరోగా నటించిన కన్నడ చిత్రం అక్కడ విజయవంతం కావటంతో తెలుగులో అనువదించామన్నారు. ఇప్పుడు తన సొంతూరు అద్దంకిలో మొదటగా బెనిఫిట్‌ను ప్రదర్శించి ప్రేక్షకుల స్పందన మేరకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలో చిత్రం విడుదల చేస్తామని వివరించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు సూర్యరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదాలు



మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఖాలేషావలి కుమారుడు మాబు సుభానిఖాన్, జాస్మిన్‌ల వివాహ రిసెప్షన్‌కు బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రావి రామనాథంబాబు, యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, రావి లీలాకృష్ణ తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు.



ఆవు గర్భంలో ఐవీఎఫ్ పిండాన్ని ప్రవేశపెడుతున్న డాక్టర్ సోమశేఖర్

ఐవీఎఫ్ పద్ధతితో మేలు జాతి పశుఉత్పత్తి

మార్టూరు: మేలు జాతి పశుఉత్పత్తిని ఐవీఎఫ్ విధానంలో అభివృద్ధి చేసుకోవడం ద్వారా బలమైన ఆరోగ్యకరమైన పశుసంపదను సృష్టించుకోవచ్చని ప్రకాశం జిల్లా చదలవాడ పశుఉత్పత్తి కేంద్ర పశువైద్యుడు సోమశేఖర్ తెలిపారు. మండలంలోని బొల్లాపల్లి రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది బొల్లాపల్లి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన ఆవు గర్భంలో ఐవీఎఫ్ పిండాన్ని అమర్చడం ద్వారా ఒంగోలు జాతికి చెందిన కోడె దూడ జన్మించగా దానికి నరసింహా అని నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం అదే ఆవుకు తిరిగి రెండో సారి ఐవీఎఫ్ పద్ధతిలో పిండాన్ని ప్రవేశ పెడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కోనంకి పశువైద్యులు క్రాంతి కిరణ్, రైతు వీరవల్లి కృష్ణమూర్తి, ఇతర రైతులు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి

ఇంకొల్లు (చినగంజాం): అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి అవగాహన కలిగి దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ ఆర్ఎం రాజ్యలక్ష్మి అన్నారు. ‘వికసిత్ భారత్ సంకల్పయాత్ర’ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇడుపులపాడు గ్రామంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల పట్ల శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలైన గృహ నిర్మాణం, పెన్షన్, రైతు భరోసా, ఆయుష్మాన్ భారత్, ఉపాధి హామీ, గ్యాస్ కనెక్షన్‌లు తదితర పథకాలకు సంబంధించి పంచాయతీలకు చేకూరిన లబ్ధి, అర్హులైన వారికి పథకాలు వర్తింపజేయడం, అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను అధికారులు చేపట్టారు. ప్రొజెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి వాటి పట్ల పూర్తి అవగాహన కల్పించారు. అధికారులు ప్రజలకు వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వైద్యాధికారి, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అన్న సంతర్పణ మహా పుణ్యకార్యం



అన్నదానం చేస్తున్న దాతలు

చీరాల టౌన్: నిరాశ్రయులకు, పేదలకు అన్నదానం చేయడం మహా పుణ్యకార్యమని పురోహిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా రామారావు అన్నారు. శనివారం మండలంలోని జాండ్రపేట శివాలయంలో వేటపాలెం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో యాజకులు, నిరుపేదలకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమానికి హాజరైన రామారావు మాట్లాడుతూ ఆపదలో, ఆకలితో ఉన్నవారికి సహాయాన్ని అందించడం దైవకార్యంతో సమానమని, ప్రతి ఒక్కరూ తమ శక్తి మేరకు పేదలకు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో వేటపాలెం క్లబ్ అధ్యక్షులు బట్ట మోహన్‌రావు, కార్యదర్శి సురేష్ బాబు, జి.పరంజ్యోతి, రోహిణీకుమార్, తదితరులు ఉన్నారు.

అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను త్వరగా అందించడంతో పాటుగా గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేసి నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. ఓటీసీలపై పలు సూచనలు అందించారు. రెవెన్యూ ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్, ఆర్ఐలు అర్జున్, శేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

అద్దంకి తాలుకా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

అద్దంకి: అద్దంకి తాలుకా 20214 క్యాంలెండర్‌ను శనివారం ఎన్జెస్పీ కార్యాలయ అవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్య నిర్వాహక ఇంజినీర్ ఉమామహేశ్వరరావు హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

25న జాబ్ మేళా

అద్దంకి: స్థానిక కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈ నెల 25న జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీసీఏ, పీజీ చేసిన విద్యార్థులు ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. కనీస వయస్సు 18 సంవత్సరాలకు పైబడి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పే టీఎం, హీరో మోటో కార్ప్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు పాల్గొనన్నుట్లు తెలిపారు. అర్హత అనుభావాన్ని ఎంపిక చేసిన వారికి రూ.15,500 నుంచి రూ. 40 వేల వరకు వేతనం ఉండే ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అభ్యర్థులు తమ వివరాలను ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు htpps://forms.gle/m3HEerkb2gU4kXRAE9 లింక్‌పై క్లిక్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ వెంట రెజ్యూమ్, విద్యార్హతల జిరాక్స్ కాపీలు, ఈ నెల 25వ తేదీ ఉదయం 8.30 గంటలకు కళాశాల ఆవరణలో నిర్వహించే జాబ్ మేళాకు తీసుకురావాలని కోరారు.

ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో నుమేర్ ప్రతిభ

చీరాల రూరల్: ఆల్ ఇండియా యూనివర్సిటీ చాంపియన్‌షిప్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు చీరాలకు చెందిన క్రీడాకారుడు షేక్ నుమేర్ ప్రాతినిధ్యం వహించి జట్టు ద్వితీయ స్థానం సాధించేందుకు కృషి చేశాడు. ఈనెల 11 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఆల్ ఇండియా యూనిర్సిటీ చాంపియన్ షిప్ 2023–2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అమరావతిలోని కేఎల్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న చీరాలకు చెందిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు నుమేర్ షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. నుమేర్ సారథ్యంలోని జట్టు అత్యుత్తమంగా రాణించడంతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. అంతేకాక గతేడాది డిసెంబర్‌లో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో కూడా న్యుమేర్ సారథ్యంలో కేఎల్ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు న్యుమేర్ తెలిపారు. ఇప్పటికే న్యుమేర్ అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వ్యక్తిగతంగా పాల్గొని పతకాలు సాధించాడు.